మల్లన్నసాగర్ నీళ్లే హైదరాబాద్‌కు దిక్కు

- 15టీఎంసీలు తరలించాలనే ఆలోచనలో ప్రభుత్వం
- కాళేశ్వరం లేకుంటే మల్లన్నసాగర్ నీళ్లు ఎక్కడివి?
- తెల్లాపూర్ జాతరలో పాల్గొన్న హరీశ్‌రావు

తెల్లాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం, ఏప్రిల్ 14: హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం మల్లన్నసాగర్ నుంచి 15 టీఎంసీలను తరలించాలనే ఆలోచన చేస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఆయన సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో జరుగుతున్న బీరప్ప జాతరకు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్నసాగర్ నిర్మాణం చేపట్టినప్పుడు చాలామంది అనేక అడ్డంకులు సృష్టించినా, మల్లన్నస్వామి దయతో ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న మల్లన్నసాగర్ నుంచే 15 టీఎంసీల నీళ్లు హైదరాబాద్‌కు తెచ్చి, ప్రజల గొంతు తడుపుతామని, మూసీనదిలో నీళ్లు పోసి అందులోని మురికిని శుద్ధి చేస్తామని అంటున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మల్లన్నస్వామి అంటే ఎంతో గౌరవమని చెప్పారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మల్లన్నకు పట్టువస్త్రాలు సమర్పించి, పట్నం వేసి వచ్చారని గుర్తుచేశారు. తాను జిల్లా మంత్రిగా పదేండ్లు మల్లన్నస్వామికి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం దక్కిందని గుర్తుచేసుకున్నారు. తెల్లాపూర్‌లో బీరప్ప ఆలయం కోసం రూ.40 కోట్లు విలువ చేసే ఎకరం భూమిని కేటాయించామని, అందులో ఆలయం నిర్మించి పెద్ద ఎత్తున జాతర చేయడం చాలా సంతోషంగా ఉన్నదని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు క్యామ మల్లేశం, పటాన్‌చెరు బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మెట్టుకుమార్, సోమిరెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాడ్గే మీనాక్షి మార్గం స్ఫూర్తిదాయకం

మీలాంటి నిజమైన సైనికులే పార్టీకి శ్రీరామరక్ష
ఎక్స్‌లో కొనియాడిన కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): ఇంట్లో శుభకార్యానికి బంధువులను పిలిచినట్టు.. ఇంటి పార్టీ రజతోత్సవాలకు ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి.. కొత్తబట్టలు పెట్టి బీఆర్ఎస్ ఆత్మబంధువులను ఆహ్వానిస్తున్న ముక్రాకే గ్రామ సర్పంచ్ గాడ్గే మీనాక్షి మార్గం స్ఫూర్తిదాయకమని కేటీఆర్ ట్వీట్‌లో కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ పండుగకు రావాలంటూ ఆలయంలో పూజలు చేయించి ఆహ్వానపత్రికలను అందించడంలో అడుగడునా తెలంగాణ సంప్రదాయం ప్రతిబింబిస్తున్నదని తెలిపారు. కేసీఆర్‌తో నాలుగుకోట్ల ప్రజలు దశాబ్దాలుగా పెనవేసుకొన్న పేగుబంధాన్ని మీ ఆత్మీయ ప్రయత్నం నలుదిశలా చాటుతున్నదని పేర్కొన్నారు. మీలాంటి నిజమైన సైనికులే పార్టీకి శ్రీరామరక్ష అని అభినందించారు.

కేసీఆర్ పాలనలో జలకళ.. కాంగ్రెస్ పాలనలో విలవిల..

'కక్షతో కాళేశ్వరం పంపులను పండబెట్టి.. నిర్లక్ష్యంతో పాలమూరు ఎత్తిపోతల పనులను పక్కన బెట్టి.. గోదారి, కృష్ణా నదులకు భారీ వరదలు వచ్చినా నీటిని ఒడిసిపట్టుకోకుండా వాడేసిన ఫలితంగానే పంటలు ఎండిపోతున్నాయి. గుక్కెడు నీళ్లులేక ప్రజల గొంతులు తడారిపోతున్నాయి' అని కేటీఆర్ ఎక్స్‌లో ధ్వజమెత్తారు. నాడు కేసీఆర్ పాలనలో జలకళను సంతరించుకున్న వాగులు, వంకలు నేడు అసమర్థ కాంగ్రెస్ పాలనలో వెలవెలబోతున్నాయని విమర్శించారు. నాడు ఇంటింటికీ నల్లా నీళ్లు అందితే నేడు ఆడబిడ్డల కళ్లల్లో కన్నీళ్లు కారుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది శ్రీశైలం, సాగర్ జలాశయాలను ఏపీ సర్కారు ఖాళీచేస్తున్నా నోరెత్తని కాంగ్రెస్ సర్కారు తప్పిదమేనని విమర్శించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని.. కేసీఆర్‌పై కక్షతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నింపని కాంగ్రెస్ పాలన పాప ఫలితమని మండిపడ్డారు.

చెక్కుతోపాటు తులం బంగారం ఇవ్వాలి

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్

వేల్పూర్, ఏప్రిల్ 14: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు కాంగ్రెస్ ఇస్తామన్న తులం బంగారాన్ని వెంటనే అందజేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్‌చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లి కష్టాలు తెలిసిన నాయకుడిగా కేసీఆర్ కల్యాణక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని ప్రారంభించి రూ.లక్ష చొప్పున సాయం అందజేశారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు చెక్కులు అందుకున్న ప్రతీ ఆడబిడ్డకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. బాల్కొండ నియోజకవర్గంలో ఆడబిడ్డలకు 847 చెక్కులు మంజూరయ్యాయని, వాటిని ఆలస్యం చేయకుండా గ్రామ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేయాలని నెల క్రితమే ఆర్డీవోకు లేఖ రాశానని చెప్పారు. మూడ్రోజుల క్రితం ఆర్డీవో కాల్ చేసి.. ఇన్‌చార్జి మంత్రి వస్తున్నారని, ఆయన చేతుల మీదుగా చెక్కుల పంపిణీ చేయనున్నట్టు చెప్పారని తెలిపారు. జీవో 18 ప్రకారం చెక్కుల పంపిణీ అధికారం ఎమ్మెల్యేది అయినా ఇన్‌చార్జి మంత్రి మీద గౌరవంతో నియోజకవర్గంలోనే ఉన్నానని తెలిపారు. చెక్కుల పంపిణీ కార్యక్రమం రద్దయిందని అధికారులు ఇప్పుడు సమాచారమిచ్చారన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు అధికార దర్పం కోసం పేదింటి ఆడబిడ్డలకు చెక్కులు అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. చెక్కుల పంపిణీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు.

నోటిఫికేషన్ రద్దు వెనుక కుట్ర

- కొత్త వారికే ఎక్కువ ర్యాంకులు
- తస్మదీయుల కోసమే కొత్త నోటిఫికేషన్
- భగ్గుమంటున్న నిరుద్యోగ జేఏసీ నేతలు జనార్దన్, మోతీలాల్ నాయక్
- సీబీఐ విచారణకు డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-1 పోస్టులను కాంగ్రెస్ నేతలు అమ్ముకున్నారా? పోస్టుకో రేటు చొప్పున బేరం పెట్టారా? తస్మదీయుల కోసం ఎంతకైనా తెగించారా? అంటే నిరుద్యోగ జేఏసీ నేతలు అవుననే చెప్తున్నారు. టాపర్లలో పలువురు కాంగ్రెస్ నేతల కుటుంబ సభ్యులు ఉన్నారని వారు పలు ఆధారాలను చూపుతున్నారు. రెండు పరీక్ష కేంద్రాల నుంచే 74 మంది టాపర్లు ఉండటం, ఒకే గదిలో రాసిన వారికి, పక్క పక్క బెంచీలు, వెనుక బెంచీల్లోని వారికి అత్యధిక మార్కులు రావడం వెనుక భారీ కుట్రదాగి ఉన్నదని నిరుద్యోగ జేఏసీ నేతలు జనార్దన్, మోతీలాల్ నాయక్ తదితరులు విమర్శిస్తున్నారు. గ్రూప్-1లో వెలుగులోకి వచ్చిన ఒక్కొక్క లోపాన్ని నిరుద్యోగ అభ్యర్థులు, ప్రజాసంఘాల నేతలు ఎత్తిచూపినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని, తమ సందేహాలను ఎందుకు నివృత్తి చేయలేదని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. గ్రూప్-1ను పెద్ద స్కామ్‌గా వారంతా అభివర్ణిస్తున్నారు. సర్కారు మొండికి పోకుండా రిటైర్డ్ జడ్జి చేత టీజీపీఎస్సీ గ్రూప్-1 స్కామ్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 ఫలితాలపై జనార్దన్, మోతీలాల్ మరికొందరు లేవనెత్తిన అభ్యంతరాలు కింది విధంగా ఉన్నాయి.

అమెరికా అభ్యర్థికి 502 మార్కులు

అమెరికా నుంచి ఇలా వచ్చి, అలా పరీక్షలు రాసిన అభ్యర్థి ఏకంగా టాపర్ అయిపోయాడు. ఆ అభ్యర్థి నేరుగా అమెరికా నుంచి పరీక్షల ముందు వాలిపోయాడట. కోచింగ్ తీసుకోలేదు. టెస్ట్ సిరీస్ ప్రాక్టీస్ కూడా చేయలేదట. కానీ గ్రూప్-1 మెయిన్స్‌లో 502 మార్కులొచ్చాయి. ఇతను కాంగ్రెస్ నేత దగ్గరి బంధువట. కాంగ్రెస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్సీ కోడలు టాపర్‌గా నిలిచారు. సదరు అభ్యర్థి రోజుకు ఐదు గంటలే చదివారట. మిగతా వాళ్లేమో 16 గంటలకు చదివినా టాపర్లు కాలేదు. కానీ ఐదు గంటలు చదివిన ఆ అభ్యర్థి మాత్రం టాపర్ అయిపోయారు. వీరంతా కాంగ్రెస్ నేతలకు దగ్గరి బంధువులు కావడంతోనే టాపర్లుగా నిలిచారని నిరుద్యోగ జేఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ అభ్యర్థులే కాకుండా మరికొందరు కాంగ్రెస్ నేతల కుటుంబసభ్యులున్నట్టు నిరుద్యోగ జేఏసీ నేతలు ఆరోపిస్తున్నారు.

పెద్దల బిగ్ స్కెచ్

గ్రూప్-1 ఉద్యోగాలపై కన్నేసిన ప్రభుత్వ పెద్దలు భారీ పథకం పన్నినట్టు సమాచారం. గ్రూప్-1 ప్రిలిమ్స్ ఎగ్జామ్ రెండోసారి నిర్వహించినప్పుడు ఓఎమ్మార్ షీట్లు అధికంగా రావడం, బయోమెట్రిక్ హాజరు అమలు చేయలేదన్న కారణంతో అభ్యర్థులు కోర్టుకెళ్లారు. కోర్టు పరీక్షను రద్దుచేసి, మళ్లీ నిర్వహించాలని తీర్పు ఇచ్చింది. తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం మారగానే టీజీపీఎస్సీ వైఖరి కూడా మారింది. హైకోర్టు పరీక్షను రద్దుచేసి, మళ్లీ ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించమంటే కాంగ్రెస్ సర్కారు ఏకంగా నోటిఫికేషన్‌నే రద్దుచేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలుచేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కూడా ఉపసంహరించుకున్నది. ఇలా టీజీపీఎస్సీ వైఖరిని ఉన్నఫళంగా మార్చుకోవడం వెనుక బిగ్ స్కెచ్ దాగి ఉన్నట్టు నిరుద్యోగులు అనుమానిస్తున్నారు.

కావాల్సిన వారిచేత దరఖాస్తులు

కొత్త నోటిఫికేషన్‌లో మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. 80 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొందరు పెద్దలకు కావాల్సినవారు దరఖాస్తు చేసినవాళ్లున్నారట. అలాంటి వారిని ఒకే కేంద్రంలో పరీక్ష రాయించి, టాపర్లుగా నిలిపారు. ఇప్పుడు ఉద్యోగాలివ్వబోతున్నారని నిరుద్యోగ జేఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. గ్రూప్-1 రద్దు వెనుక ఇంత పెద్ద కుట్రదాగి ఉందని తాము ముందే గ్రహించలేకపోయామంటున్నారు.

టాపర్లలో ఎక్కువమంది కొత్త అభ్యర్థులే

గ్రూప్-1 జీఆర్ఎల్‌లో, టాపర్ల జాబితాలో అత్యధికులు కొత్తగా 2024లో దరఖాస్తుచేసిన వారేనట. 2022లో దరఖాస్తు చేసిన వారు భూతద్దం పెట్టి వెతికినా దొరకడం లేదట. 2022లో దరఖాస్తు చేసిన వారు మూడు సార్లు ప్రిలిమ్స్ పరీక్షను రాశారు. మెయిన్స్‌కు కోచింగ్ కూడా తీసుకున్నారు. అయినా టాపర్లల్లో పాత వారు తక్కువగా ఉండటం, కొత్తగా దరఖాస్తు చేసిన వారి నుంచే అత్యధికులు ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సీబీసీఐడీ చేత విచారణ జరిపించాలి

గ్రూప్-1 స్కామ్‌పై సీబీసీఐడీ చేత విచారణ జరిపించాలని నిరుద్యోగ జేఏసీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. జ్యుడీషియల్ కమిషన్ వేసి విచారణ జరపాలని కోరుతున్నారు. జేఏసీ నేతలు సోమవారం ఓయూలో అంబేద్కర్ ఫొటోలు చేతపట్టుకుని నిరసనకు దిగారు. నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ 75 రోజుల్లో మూల్యాంకనం చేయడం, వరుస హాల్‌టికెట్ నంబర్లు కలిగిన 68 మందికి ఒకే మార్కులు రావడం. ఉర్దూలో పరీక్ష రాసిన 9 మందిలో ఏడుగురికి అత్యధిక మార్కులు రావడం వెనుక ఆంత్యర్యమేమిటని ప్రశ్నించారు. స్థానికేతర అభ్యర్థులకు కుల ప్రాతిపదికన రిజర్వేషన్ ఎలా ఇస్తారని, ఎంపికైన అభ్యర్థుల ప్రిలిమ్స్, మెయిన్స్ హాల్‌టికెట్లను బయటపెట్టాలని ప్రభుత్వాన్ని మోతిలాల్‌నాయక్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ కీలక నేతల లీలలు!

- ఎమ్మెల్సీగా పనిచేసిన ఓ కాంగ్రెస్ నేత కోడలు గిరిజన కోటాలో టాపర్ జాబితాలో నిలిచింది. ఈ అభ్యర్థికి ఉద్యోగం ఖాయమైందట.
- ఎమ్మెల్సీగా పోటీచేసిన నేత కూతురు సైతం టాపర్ల జాబితాలో ఉన్నారట. కాంగ్రెస్‌నే నమ్ముకున్న ఈ నేతకు ఈ రూపంలో న్యాయం జరిగిందని కొందరు చర్చించుకోవడం గమనార్హం.
- ఖమ్మం జిల్లాకు చెందిన సర్కారులోని కీలకమైన వారి సన్నిహితులు కూడా టాపర్లలో ఎంపికైనట్టుగా నిరుద్యోగ జేఏసీ నేతలు ఆరోపిస్తున్నారు.
- ఓ ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్సీలు తరుచూ టీజీపీఎస్సీలో జోక్యం చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఎవరికీ ఎంట్రీలేని టీజీపీఎస్సీ కార్యాలయానికి సదరు ఎమ్మెల్సీల్లో ఒకరు అనేకసార్లు వెళ్లొచ్చినట్టు, సదరు ఎమ్మెల్సీ పాత్ర కూడా ఉండి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.
- కొడంగల్‌కు చెందిన ఓ అభ్యర్థి ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగంలో ఉండగా, మెయిన్స్‌లోనూ మంచి ర్యాంకు సాధించాడు. ఇతను సీఎం కుటుంబానికి దగ్గరి బంధువట.

గ్రూప్-1లో భారీ స్కామ్

- మెయిన్స్ పరీక్షలు రాసింది 21,093 మంది అభ్యర్థులు
- 21,103 మంది అభ్యర్థులకు ఫలితాలు ఎలా ఇచ్చారు?
- 654 మందికి ఓకే రకమైన మార్కులెలా వచ్చాయి?
- గ్రూప్-1లో చేతులు మారిన కోట్లాది రూపాయలు
- స్కామ్‌పై వెంటనే న్యాయ విచారణ జరిపించాలి
- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో భారీ స్కామ్ జరిగిందని, కోట్లాది రూపాయలు చేతులు మారాయని, దేశ చరిత్రలోనే ఇదే అతిపెద్ద కుంభకోణమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సంచలన విమర్శలు చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రిలిమ్స్‌లో ఓ హాల్‌టికెట్, మెయిన్స్‌లో మరో హాల్‌టికెట్ ఇవ్వడం దేశ చరిత్రలోనే లేదని తెలిపారు. 21,093 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తే, 21,103 మందికి ఫలితాలు ఎలా ఇచ్చారు? అని ప్రశ్నించారు. 10 మంది అదనంగా ఎక్కడి నుంచి వచ్చారో తెలంగాణ యువతకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 654 మందికి ఓకే రకమైన మార్కులు ఎలా వచ్చాయని అనుమానం వ్యక్తం చేశారు. తాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి సమాచారాన్ని సేకరించే మాట్లాడుతున్నానని చెప్పారు. గ్రూప్-1 పేపర్లు 60 రోజుల్లోనే దిద్దారని, పేపర్ల వాల్యూయేషన్‌కు నాలుగైదు నెలలైనా సమయం పడుతుందని చెప్పారు. 10 వేల మంది పరీక్షలు రాసిన కేంద్రాల్లో కేవలం 69 మందికే ఉద్యోగాలు వచ్చాయని, 1,494 మంది మహిళలు పరీక్షలు రాసిన రెండు కేంద్రాల్లో 74 మందికి ఉద్యోగాలెలా వస్తాయని నిలదీశారు. 18, 19 కేంద్రాల్లో పరీక్షలు రాసిన ఆ 74 మందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ కోడలికి 206వ ర్యాంక్ వచ్చిందని, ఎస్టీల్లో ఆమెదే మొదటి ర్యాంకు అని, ఆమె 19వ నంబర్ పరీక్ష కేంద్రంలోనే పరీక్ష రాసినట్టు చెప్పారు. ఈ రెండు పరీక్ష కేంద్రాలు హైదరాబాద్ కోఠి ఉమెన్స్ కళాశాలలోనే ఉన్నాయని, ఆయా కేంద్రాల్లో మహిళలకే అవకాశం ఇచ్చారని వెల్లడించారు. మహిళలకు ప్రత్యేకంగా పరీక్ష కేంద్రాలను ఎందుకు ఏర్పాటుచేశారని ప్రశ్నించారు. ఉర్దూ మీడియంలో తొమ్మిది మంది పరీక్షలు రాస్తే ఏడుగురికి ఉద్యోగాలు వచ్చాయని, తెలుగు మీడియంలో 7,800 మంది పరీక్షలు రాస్తే 70 మందికే ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఇంత తక్కువ మందికి ఎలా ఉద్యోగాలు వస్తాయని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు.

కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు

కేసీఆర్ హయాంలో బీజేపీ నేతలు ఎగిరెగిరి పడ్డారని, ఇపుడు గ్రూప్-1 కుంభకోణంపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంలో కూడా కాంగ్రెస్, బీజేపీ నేతలు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

న్యాయ విచారణ జరిపించాలి

గ్రూప్-1 పరీక్షను రద్దు చేయాలని, మొత్తం వ్యవహారంపై న్యాయ విచారణ జరిపించాలని పాడి కౌశిక్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, కోదండరాంరెడ్డికి, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీకి ఉద్యోగాలు రాగానే నిరుద్యోగుల గురించి మరిచిపోతారా? అని ధ్వజమెత్తారు. తమ పార్టీ నేత రాకేశ్‌రెడ్డి ఇదే అంశంపై మాట్లాడితే నోటీసులు పంపారని, తమకు ఎన్ని నోటీసులు పంపినా భయపడేది లేదని తేల్చి చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ పోలీసులను పంపి తన మీద కేసులు బనాయించే అవకాశం ఉన్నదని, అయినా భయపడేది లేదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి రాష్ట్రం నుంచి చెరో ఎనిమిది ఎంపీ స్థానాల్లో ప్రజలు గెలిపిస్తే రెండు పార్టీలు కలిసి అదే ప్రజలకు ద్రోహం చేస్తున్నాయని ఆరోపించారు.

జాబ్ క్యాలెండర్ ఏమైంది?

బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు


యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 14 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో యువతను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్, 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో చేపట్టిన పాదయాత్ర అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే వరకు ప్రతి నెలా రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ అమలుచేయకుండా నమ్మకద్రోహం చేసిందని మండిపడ్డారు. 18 ఏండ్ల పైబడిన విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు పంపిణీ చేస్తామని చెప్పి ఒక్కటీ ఇవ్వలేదన్నారు. ఉద్యోగాల భర్తీ కోసం బీఆర్ఎస్‌వీ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు విద్యార్థులు, యువతీయువకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మోదీజీ.. 2029 కష్టమే!

> మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం విఫలమైందనే చెప్పొచ్చు.

ప్రశ్న: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ఏ ప్రధాని ఎక్కువగా ఫెయిల్ అయ్యారు?

గ్రోక్: నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి ప్రతీ ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షలను జమ చేస్తానని ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ హామీనిచ్చారు. అలాగే ఏడాదికి 2 కోట్ల చొప్పున ఉద్యోగాలు ఇస్తామని, 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని వాగ్దానాలు చేశారు. అయితే, ఇవన్నీ అమలు కాలేదు. దీన్నిబట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో నరేంద్రమోదీ ఎక్కువగా ఫెయిల్ అయ్యారని చెప్పొచ్చు.

ప్రశ్న: ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని మోదీని దేశ ప్రజలు నాలుగోసారి ప్రధానిగా అంగీకరిస్తారా?

గ్రోక్: ఉద్యోగాల కల్పన, రైతుల ఆదాయం రెట్టింపు, నల్లధనం వెనక్కి తీసుకురావడం వంటి హామీలను నెరవేర్చడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారు. దీనికి తోడు నిరుద్యోగం, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడం, రైతుల సమస్యలను పరిష్కరించడం వంటి సవాళ్లు అలాగే ఉన్నాయి. నిరుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వీటి ప్రభావం కీలకంగా మారడంతో గతంతో పోలిస్తే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 63 సీట్లను కోల్పోయి 240 స్థానాలకు పరిమితం కావాల్సి వచ్చింది. మెజారిటీ మార్కు 272 కంటే ఇది చాలా తక్కువ. ఈ ఫలితాలు ప్రజల్లో బీజేపీ, మోదీ పాలన పట్ల ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తున్నాయి. వచ్చే దఫా ఎన్నికల నాటికి నిరుద్యోగం, ధరలు, రైతు సమస్యలను పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం ఇప్పటిలాగే విఫలమైతే, ఆ ఎన్నికల్లో గెలవడం బీజేపీకి కష్టమే కావొచ్చు. 2029నాటికి మోదీ వయసు 79 ఏండ్లు దాటడం కూడా బీజేపీ గెలుపునకు ఒక అవరోధంగా మారొచ్చు కూడా.

అమల్లోకి ఎస్సీ వర్గీకరణ చట్టం

- గెజిట్, మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- విద్యా, ఉద్యోగ రంగాలకు మాత్రమే పరిమితం
- ఎస్సీ అభ్యర్థులు లేకుంటే పోస్టులు క్యారీఫార్వార్డ్
- గ్రూపులవారీగా రోస్టర్ పాయింట్ల కేటాయింపు

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ స్వరూపం

మొత్తం ఎస్సీ రిజర్వేషన్లు	15శాతం
గ్రూప్-ఏ(15 ఉపకులాలు)	1శాతం
గ్రూప్-బీ (మాదిగ సహా 18 కులాలు)	9 శాతం
గ్రూప్-సీ (మాల సహా 26 కులాలు)	5 శాతం

హైదరాబాద్, ఏప్రిల్14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) చట్టం-2025 పేరిట గెజిట్ విడుదల చేసింది. ఇది తక్షణం అమల్లోకి వచ్చినట్టు స్పష్టంచేసింది. ఎస్సీలకు ఇప్పటివరకు ఉమ్మడిగా అమలైన రిజర్వేషన్లు, ఇకపై గ్రూపులవారీగా అమలు కానున్నాయని తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 59 షెడ్యూల్డ్ కులాలు ఉండగా ఇప్పటివరకు ఆ కులాలకు 15శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నది. ప్రస్తుతం మొత్తం షెడ్యూల్డ్ కులాలను వాటి జనాభా, ఆర్థిక వెనుకబాటు ఆధారంగా 3 గ్రూపులుగా ప్రభుత్వం విభజించింది. విద్యా, ఉద్యోగ నియామకాల్లో, స్థానిక సంస్థల్లో ఇతర వాటిల్లో సవరించిన రిజర్వేషన్లను మాత్రమే పాటించాలని గెజిట్‌లో వెల్లడించింది. గెజిట్‌తో పాటుగా రిజర్వేషన్ల అమలుకు మార్గదర్శకాలను, ప్రభుత్వ సర్వీస్ నియమకాల కోసం రోస్టర్ పాయింట్లను కూడా సవరిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు విడుదల చేసింది.

జనాభా లెక్కల తర్వాతనే రిజర్వేషన్ పెంపు: మంత్రి ఉత్తమ్

ఎస్సీ రిజర్వేషన్ ఉప వర్గీకరణ చట్టం గెజిట్ కాపీపై మంత్రివర్గ ఉపసంఘం సచివాలయంలో సోమవారం చర్చించింది. గెజిట్ తొలి కాపీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేసింది. అనంతరం ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2026 జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రంలో ఎస్సీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్ శాతాన్ని పెంచుతామని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి విద్యా, ఉద్యోగ అవకాశాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించామని, ప్రభుత్వం చేపట్టిన వర్గీకరణ ఏ కులానికీ వ్యతిరేకంకాదని చెప్పారు. వర్గీకరణ కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరులకు నివాళి అర్పించారు.

చట్టం నూతన మార్గదర్శకాలు

- ప్రభుత్వ ఉద్యోగాలను తొలుత గ్రూప్-1లోని కులాలతో, అక్కడ మిగిలితే గ్రూప్-2, ఆ తర్వాత గ్రూప్-3 లోని కులాలతో భర్తీ చేస్తారు. 3 గ్రూపుల్లోనూ అర్హత కలిగిన అభ్యర్థులు లేకపోతే ఆ ఖాళీలను క్యారీ